సభకి నమస్కారం.

సాహిత్య సౌరభాలు కేవలం పుస్తకాల్లోనూ, కవితల్లోనూ మాత్రమే కాదు గుబాళిస్త. పెద్దగా చదువుకోని సామాన్యుడికీ, పాటక జనానికీ కూడా అందుబాటులో ఉన్న అత్యంత ప్రభావశీలమైన చలన చిత్ర రంగం లో కూడా సాహిత్యం పరిమళించింది, సినిమా రంగం కొత్త పుంతలు తొక్కడానికి దోహద పడింది. తెలుగు చలనచిత్ర రంగపు చరిత్రని పరిశీలిస్తే, కళాఖండాలు అని మనమంతా ఒప్పుకునే ప్రతీ సినిమా తాలూకు విజయం వెనుకా కథాబలం, సంగీతం, దర్శకత్వం, నటీ నటుల కృషి తో పాటుగా పెద్ద పీట వేసుకుని ఉంటాయి, ఆ సినిమా లోని పాటలు. కొన్నేళ్ళకి సినిమా లోని మిగిలిన అంశాలు మరుపుకొచ్చినా పాటలు మాత్రం మరపు రావు. పాటలోని సాహిత్యం ఎంత అందంగా, నవనవోన్మేషంగా ఉంటే పాటకి అంత ఆయుష్షు ఉంటుంది.

పాటలోని రాగాన్ని, సంగీతాన్ని పక్కన పెట్టి కవితలా చదివితే ఆ కవిత మనసుని కదిలించగలిగితే, ఓహో అనిపించగలిగితే, ఆ పాటని సాహిత్యం అనచ్చు. ఇదీ నా నిర్వచనం. అంతే కాదు, ఆ కవితని మళ్ళీ సంగీతంతో జోడించి పాటలా పాడినప్పుడు దాని అందం ఇనుమడిస్తే, అది ఉత్తమమైన కవితా సాహిత్యం. ఎందుకంటే కవిత అనేది ఛందోబద్ధమైనా కాకపోయినా దానిలో ఒక లయ ఉంటుంది. సంగీతాన్ని తనలో ఇముడ్చుకునే పుడుతుంది కవిత. సాహిత్యం సినిమా పాటలు కాగలదు. సినిమా పాటలన్నీ సాహిత్యం కాలేవు.

కొంతమంది కవుల రచనలు సినిమాల్లో చోటు చేసుకున్నాయి – సినిమాల కోసమని రాయకపోయినా కూడా. అలాగే మరికొంతమంది సినిమాల కోసమే రాస్తూ కూడా సాహిత్యాన్ని సృష్టించారు. గుంటూరు శేషేంద్ర శర్మ, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, దేవులపల్లి కృష్ణ శాస్త్రి, శ్రీశ్రీ, సి నారాయణ రెడ్డి, సీతారామ శాస్త్రి లాంటి కవులు, మల్లాది రామకృష్ణ శాస్త్రి, పాలగుమ్మి పద్మరాజు, ఆరుద్ర, ఆత్రేయ లాంటి రచయితలు, వేటూరి లాంటి mainstream సినిమా రచయితలు, వీరందరు సినిమా రంగాన్ని సుక్షేత్రం చేసి సాహిత్యాన్ని పండించారు. అలా మనకి లభించిన ఆణి ముత్యాల్లాంటి పాటలు కొన్నిటిని గురించి ముచ్చటించుకుందాం. ఆ పాటలు ప్రేక్షకులని, శ్రోతలని మాత్రమే కాక సినిమా రంగాన్ని ఎలా ప్రభావితం చేసాయో చూద్దాం. ఈ అంశం సముద్రమంత అగాథం. అగస్త్యుడిలాగ మొత్తం ఔపోసన పట్టలేకపోయినా, వీలైనంత వరకు ఆస్వాదిద్దాం.

---

సాంబ్రాణి పొగ మాటు ఓ చందమామ
నీ అగులు సుక్కా సొగసు అద్దానికీసు
సేలాపై పారాడు బాలా కిట్టమ్మ
సెమలీ కన్నేదిరా నా కూసు కొమ్మా

ఇవి ఇంద్రగంటి శ్రీకాంత శర్మ గారు రాసిన కవితలోని నాలుగు లైన్లు. ఈ కవిత బాపు దర్శకత్వం వహించిన కృష్ణావతారం అనే సినిమాలో పాటయ్యింది. ఒక చంటిపిల్లాడిని చూస్తూ హీరో పాడే పాట. పాటలోని సాహిత్యం మనం మరిచిపోయిన అగులు చుక్క లాంటి తెలుగు మాటలని, చంటి పిల్లలకి నీళ్ళుపోసాక సాంబ్రాణి పొగ వేసి దిష్టి తగలకుండా అగులు చుక్క పెట్టే తెలుగు వాళ్ళ సంస్కృతిని గుర్తు చేస్తుంది. జాను తెలుగు, తేలిగ్గా ఉండే మాటలు, మనసుని పట్టి చిన్నతనంలోకి లాక్కెళ్ళిపోయే sentiment ఇవన్నీ ఉన్నాయి ఈ సాహిత్యంలో. ఇలాంటి పాటలే మన భాషకి, సంస్కృతికి భోషాణం పెట్టెలు. ఐదారు తరాలు వెళ్ళిపోయాక భాష చాల వరకు రూపాంతరం చెందిపోయాక అచ్చ తెలుగు ఎలా ఉంటుందీ అంటే

ఈ పెట్టెలని తెరవాల్సి ఉంటుంది.

---

బాపు గారిదే మరో సినిమా ముత్యాల ముగ్గు. అందులో "ఏదో ఏదో అన్నది ఈ మసక మసక వెలుతురు – గూటి పడవలో విన్నది కొత్త పెళ్ళికూతురు" అన్న పాట ఆరుద్ర గారి సాహిత్య సృష్టి, ఎంతో ప్రజాదరణ పొందిన పాట. ఐతే ఇదే సినిమాలో మరొక ఆణి ముత్యం, సిచ్యుయేషనల్ పాటలకి మకుటాయమానమైన పాట ఒకటుంది.

నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది
కన్నుల్లో నీరు తుడిచి కమ్మటి కల ఇచ్చింది
రమ్యంగా కుటీరాన రంగవల్లులల్లింది
దీనురాలి గూటిలోన దీపంలా వెలిగింది
శూన్యమైన వేణువులో ఒక స్వరం కలిపి నిలిపింది
ఆకు రాలు అడవికి ఒక ఆమని దయ చేసింది

అపవాదు పడి భర్త నుంచి దూరమైపోయిన భార్య అనుకోకుండా తన భర్తని దూరంగా ఒక రాదారి పడవ మీద చూసినప్పుడు కలిగిన క్షణికమైన ఆనందాన్ని, దాని వెనుకే కలిగే నైరాశ్యాన్ని, ఒక విధమైన డెస్పరేషన్ ని ఈ పాట ఎంతో అందంగా చూపెడుతుంది. కానీ ఈ పాట ఈ సినిమా కోసం రాసినది కాదు. ఈ సన్నివేశానికి రాసినదీ కాదు. గుంటూరు శేషేంద్ర శర్మ గారి కవిత. బాపు గారికి నచ్చి, సినిమాకి సన్నివేశానికి సరిపోతుందని తీసుకున్న పాట.

---

మేఘసందేశం గొప్ప ప్రజాదరణతో పాటుగా నాలుగు జాతీయ పురస్కారాలు, ఇరవై ఏడు చలనచిత్ర రంగ పురస్కారాలు పొందిన సినిమా. ఈ సినిమా కలకాలం గుర్తుండిపోడానికి కారణం ఈ సినిమాలో పాటలే. వేటూరి రాసిన "ఆకాశ దేశాన ఆషాఢ మాసాన మెరిసేటి ఓ మేఘమా" అన్న పాట విన్నప్పుడు, కాళిదాసు మేఘసందేశం, మల్లీశ్వరిలో "ఆకాశ వీధిలో హాయిగా ఎగిరేవు" అన్న పాట గుర్తుకు వస్తాయి. కాళిదాసుతో పోలిక సాహసమే, కానీ ఈ పాటలోని సాహిత్యం ఆ సాహసానికి వొడిగట్టేలా చేస్తుంది. పాట వినడం పూర్తయ్యే సరికి శ్రోతకి ఒక రకమైన నిస్త్రాణ కలుగుతుంది, దిగులు ఆవరిస్తుంది. పాత్ర యే భావాన్ని అనుభవిస్తోందో అదే భావాన్ని శ్రోత మనసులో ఆవిష్కరిస్తుంది ఈ పాట. ఇంత కంటే సాహిత్యానికి పరమార్థం ఏముంది?

ఈ సినిమాలో ఈ పాట ఒక ఎత్తైతే, జయదేవుడి అష్టపదికి పాలగుమ్మి పద్మరాజు గారు చేసిన అనువాదం మరొక ఎత్తు. గీతగోవిందం యే మీటర్లో ఉందో అదే మీటర్లో పెద్ద పెద్ద సంస్కృతం వాక్యాలని, భావంలో మార్పు లేకుండా చక్కటి తియ్యటి తెలుగులో రాయడం – ఆ పాట విన్నప్పుడే దాని గొప్పదనం తెలిసేది.

వదసి యది కించిదపి దంత రుచి కౌముది
హరతిదర తిమిరమతి ఘోరం
పలికితే చాలు నీ పలు వరుస వెన్నెలలు
కలికి నా యెడద చీకటుల పోద్రోలు
స్ఫురద ధర శీధవే తవ వదన చంద్రమా
రోచయతు లోచన చకోరం
నీ మోము జాబిల్లి మోవి తేనియలు
నా నయనములు చకోరమ్ములై గ్రోలు

సంస్కృత భాష నడకని, వ్యాకరణాన్ని, లిపిని, ఉచ్చారణనీ తెలుగు భాష అనుసరించినంతగా ఇంకే భాషా అనుసరించలేదు. ఈ వాక్యాలని మరే భాషలోకి అనువదించాలన్నా ఈ మీటర్లో పట్టించడం సాధ్యం కాదు. రెండు పారాగ్రాఫులు రాయాల్సి ఉంటుంది.

---

"దిగిరాను దిగిరాను దివి నుండి భువికి" అన్న భావకవి దేవులపల్లి వారి భావ ప్రపంచం సినిమా ప్రపంచాన్ని కలిసిన చోటల్లా ఒక్కో ఆణిముత్యం లాంటి పాట.
ద్వారానికి తారామణి హారం, హారతి వెన్నెల కర్పూరం
మోసం ద్వేషం లేని సీమలో మొగసాల నిలిచెనీ మందారం

అన్న మాటలు తెలియని తెలుగు సినిమా ప్రేక్షకుడు ఉండడేమో. ఇలాంటివే ఎన్నెన్నో పాటలు –
– మావి చిగురు తినగానే కోవిల పలికేనా
– పండు వెన్నెలా మనసు నిండా వెన్నెలా
  కొండా పైనా కోనా పైన కురిసే వెన్నెలా విరిసే వెన్నెలా
– నీలమోహనా రారా నిన్ను పిలిచె నెమలి నెరజాణ
– శీతవేళ రానీయకు రానీయకు, శిశిరానికి చోటీయకు చోటీయకు
– నా పేరు బికారి నా దారి యెడారి మనసైన చోట మజిలి కాదన్న చాలు బదిలీ
– యే పాట నే పాడనూ బ్రతుకే పాటైన పసివాడనూ
– మేడంటే మేడా కాదు గూడంటే గూడూ కాదు పదిలంగా అల్లూకున్నా పొదరిల్లూ మాది
చెప్పుకుంటూ పోతే అంతు కనపడదు.

---

దేవులపల్లి వారికి శ్రీశ్రీ కీ కవిత్వం లో చుక్కెదురైనా సినిమా పాటల సాహిత్యంలో యే మాత్రమో పోలికలు కనపడతాయి. డాక్టర్ చక్రవర్తి సినిమాలో మనసున మనసై అన్న పాట విన్నవాళ్ళెవరూ అది శ్రీశ్రీ రాసింది అనుకోరు తెలిస్తే తప్ప. శ్రీశ్రీ సిగ్నేచరూ, ఫ్లేవరూ బాగా కనపడే పాట ఒకటుంది ఆకలి రాజ్యం అన్న సినిమాలో.

ఓ మహాత్మా ఓ మహర్షి
ఏది తెలుపు ఏది నలుపు
ఏది గానం ఏది మౌనం
ఏది నాది ఏది నీది
ఏది నీతి ఏది నేతి
నిన్న స్వప్నం నేటి సత్యం
నేటి ఖేదం రేపు రాగం
ఒకే కాంతి ఒకే శాంతి
ఓ మహర్షీ ఓ మహాత్మా
ఈ పాటకి సంగీత దర్శకుడు వాయిద్యాలని వాడనే లేదు. శ్రీశ్రీ కవితలో ఉండే లయ, రిథమ్ గొప్పదనమది. మరో చిత్రమైన సంగతి ఏమిటంటే, కన్యాశుల్కం సినిమాలో చివర్లో మధురవాణి ఒక మేజువాణిలో "ఆనందం ఆర్ణవమైతే అనురాగం అంబరమైతే" అన్న పాట పాడుతుంది. కన్యాశుల్క రచయిత కాలం శ్రీశ్రీ కాలం కంటే ఎంతో ముందు. ఐనా కూడా ఆ కవిత సొగసుకు మురిసి దాన్ని ఈ సినిమాలో పాటగా చేసుకున్నారు.

---

ఏమి పిలుపు అది ఏమి పిలుపు
బృందా నికుంజముల పూలు పూసి
శరదిందు చంద్రికల కేలు సాచి
కరుణాంతరంగముల దాగి దాగి
చెలి అందెలందు చెలరేగిరేగి
నను తొందరించెరా తొలకరించెరా

విశ్వనాథ సత్యనారాయణ గారి నవలని తెర మీదకి ఎక్కించడం అనేది భగీరథ ప్రయత్నం లాంటిదే. ఆయన పాత్రలను మలచిన తీరు సెల్యులాయిడ్ కి అందదు. గొప్ప నటీనటవర్గం ఉన్నా కూడా ఆ సినిమాలో ఆ పాటలే లేకపోతే ఏకవీర, వీర భూపతి, మీనాక్షి, సేతుకుట్టాన్ పాత్రలు జీవం పోసుకునేవే కావు. ఆ సినిమాలో రసావిష్కరణమంతా పాటలతోనే జరిగింది. విశ్వనాథ వారి నవలని సినిమాగా తీసి ప్రేక్షకుల చేత ఔననిపించుకోడం సి నారాయణ రెడ్డి గారి విద్వత్తుకి గీటురాయి.

కరిమబ్బులు కమ్మేవేళ మెరుపు తీగే వెలుగు
కారుచీకటి ముసిరేవేళ వేగుచుక్కే వెలుగు
మతి తప్పిన కాకుల రొదలో మౌనమే వెలుగు
దహియించే బాధల మధ్యన సహనమే వెలుగు
చిగురంత ఆశ జగమంత వెలుగు

ఈ వాక్యాలు సినారే గారు గోరంతదీపం అన్న సినిమాకు రాసారు. ఎవరికైనా సరే జీవితంలో ప్రాక్టికల్ గా అన్వయించుకోగలిగిన లైన్లివి.

---

శంకరాభరణం లాంటి దృశ్యకావ్యాలకి ఒరవడి పెట్టిన సినిమా సిరిసిరిమువ్వ. మనసుని దోచేసే సింప్లిసిటీ ఉన్న పాటలు.

"ఝుమ్మంది నాదం" అన్న పాట అందరికీ తెలిసినదే. ఎంత పాపులర్ అయ్యిందంటే, ట్యూను వాయిద్యాల మోజులో ఉండిపోయి నేను చాలాకాలం పాట సాహిత్యాన్ని గమనించనేలేదు. గమనిస్తే తెలిసింది దాని అందం – "ఎదలోని సొదలా ఎలదేటి రొదలా కదిలేటి నదిలా కలల వరదలా" ఇదే సినిమాలో చాలా మంది ఎన్నడూ వినని పాట ఒకటుంది, మరింత అందమైనది. దాన్ని పాట కంటే కవిత అనడమే సమంజసం.

ఒడుపున్న పిలుపూ ఒదిగున్న పులుపూ ఒక గొంతులోనే పలికింది అది యే రాగమని నన్నడిగింది
అది మన వూరి కోయిలమ్మా నిన్నడిగింది కుశలమమ్మా
గోదారల్లే యెన్నెట్లో గోదారల్లే యెల్లువా గోదారల్లే యెన్నెట్లో గోదారల్లే
ఎదలో ఏదో మాటా రొదలో ఏదో పాట గోదారల్లే యెన్నెట్లో గోదారల్లే

ఇలాంటి పాటలని పాడుకుని అనుభవించగలమే కానీ వీటి గురించి ఎక్కువ చెప్పలేము. చక్కెర తీపిని ఎలా వర్ణించడం?

---

శంకరాభరణం సినిమా పాటలు, తరువాత వచ్చిన సినిమాలకి ఎంత ఒరవడి పెట్టాయంటే, ఆర్టు సినిమా కాకుండా కమర్షియల్ సినిమా తీసినా కూడా కనీసం ఒక ఆర్టు పాట ఉండాలి అని నిర్మాతలు కోరుకునే

స్థాయికి వెళ్ళింది పరిశ్రమ. అసెంబ్లీ రౌడీ వంటి చిత్రంలో "అందమైన వెన్నెలలోనా అచ్చ తెలుగు పడుచువలే" అన్న పాట ఉండటమే దీనికి తార్కాణం.

----------------------------------------------------------------------------------------------------------------

చివరిగా సముద్రాల జూనియర్ రచించిన ఒక పాటని పేర్కొనకపోతే కదిలించిన పాటల లిస్టు పూర్తి కాదు. పాండురంగ మహత్యం సినిమాలో "అమ్మా అని అరచినా ఆలకించవేమమ్మా" అన్న పాట ఒక అనర్ఘ రత్నం. అమ్మ మీదా అమ్మ గొప్పతనం మీదా తెలుగులో చాలా పాటలే వచ్చాయి. నాన్న గొప్పతనం ఏమిటీ అని ఎవరైనా అడిగితే గబుక్కున మనకేమీ తట్టదు. మన తండ్రి గారితో ఉన్న అనుభవాన్ని బట్టీ మన తండ్రి గొప్పతనం ఎమిటో చెప్పగలం కానీ, అమ్మ గొప్పతనాన్ని విశ్వజనీనం గా చెప్పినట్టు నాన్న గొప్పతనాన్ని విశ్వజనీనం గా చెప్పడానికి మన దగ్గర పాయింట్లు ఉండవు. అమ్మ అంటే పది నెలలు మోస్తుందనీ, ఊడిగాలు చేస్తుందనీ, ఎన్నో ఉన్నాయి. నాన్న గొప్పతనం ఏంటో ఈ రచయిత ఈ పాటలో చెప్తే కానీ నాకు తట్టనే లేదు.

దేహము విజ్ఞానము బ్రహ్మోపదేశమిచ్చి
ఇహ పరాలు సాధించే హితమిచ్చిన తండ్రిని

అంటాడు పాండురంగడు. ఇంత కంటే గొప్ప ఉపకారం ఎవరు చెయ్యగలరు? ఈ పాట ఎంత ప్రభావితం చెయ్యగలదో ఇటీవలే విడుదల ఐన పాండురంగడు సినిమాలో మాతృదేవోభవా అన్న పాటే చెప్తుంది. కొన్ని తరాలు పోయాక జీవితంలో అమ్మా నాన్నల పాత్ర ఏమవుతుందో, ఎంత వరకు పరిమితమవుతుందో చెప్పలేము. కానీ ఈ పాట మాత్రం అమ్మా-నాన్నల పాత్ర ఎలా ఉండేదో, వాళ్ళ పట్ల గౌరవము ఆదరము ఎలా ఉండాలో చెబుతుంది.

ఆచార్య ఆత్రేయ అన్నట్టు "గంగ వెల్లువ కమండలంలో ఇమిడేదేనా?" మనకున్న తెలుగు పాటలు ఏడు సముద్రాల అవతల మంత్రాల దీవిలో ఊడల మర్రి కిందనున్న సొరంగం లో ఉన్న నిధి లాంటివి. ఎంత తీసినా తరగవు. ఉన్న సమయంలో కొన్ని పాటలని తలుచుకుని ఆ స్ఫూర్తితో మరిన్ని మంచి పాటలు వినడానికి, మంచి సాహిత్యాన్ని ఎక్కడున్నా గుర్తించడానికీ, ప్రోత్సాహించడానికీ ప్రయత్నిద్దాము.

జైహింద్